## క్లుప్తంగా

### ఓటు నమోదు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి



ఓటరు జాబితాను చదివి వినిపిస్తున్న ఆర్డీఓ సీతారామారావు

**పెద్దాపురం:** కొత్తగా 18 ఏళ్ల నిండినవారు ఓటు నమోదు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ సీతారామారావు కోరారు. ఓటర్ జాబితా డ్రాఫ్ట్ ప్రక్రియలో భాగంగా ఆదివారం ఆయన మండలంలోని సిరివాడలోని పోలింగ్ బూత్ వద్ద ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 2, 3, తేదీల్లో ప్రత్యేక ఓటు నమోదు కార్యక్రమం చేపట్టనున్నామని చెప్పారు. ఓటర్ జాబితాలో తప్పులుంటే సరిచూసుకోవాలన్నారు. ప్రతి గ్రామంలో పోలింగ్ బూత్ వద్ద ఓటరు జాబితాను చదివి వినిపిస్తారని పేర్కొన్నారు. ఆయన వెంట తహసీల్దార్ జితేంద్ర ఉన్నారు.

### పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఆర్డీఓ



గొంచాలలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ సీతారామారావు

**సామర్లకోట:** మండలంలోని పోలింగ్ కేంద్రాలను ఆదివారం పెద్దాపురం ఆర్డీఓ జె.సీతారామారావు పరిశీలించారు. ఓటర్ల తుది జాబితా తయారు కావడంతో ఓటర్ల నుంచి అభ్యంతరాలు స్వీకరించడానికి శని, ఆదివారాలు ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో ఆదివారం ఉండూరు, పనసపాడు, గొంచాల గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి, ఆయా పార్టీల నాయకుల నుంచి సమాచారం సేకరించారు. జనవరి ఒకటి నాటికి 18 ఏళ్ల నిండినవారు నూతన ఓటర్లుగా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. అదే విధంగా పట్టణంలోని యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ హైస్కూల్, కోదండరామపురంలోని పోలింగ్ కేంద్రాలను మున్సిపల్ కమిషనర్ జె.రామారావు పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు బీఎల్ఓలు ఓటర్ల నుంచి ఫారాలు స్వీకరించారు.

### మాదిగ మహాసభ పోస్టర్ ఆవిష్కరణ



కొండెవరంలో మాదిగ మహా సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నేతలు

**కొత్తపల్లి:** హైదరాబాద్‌లో ఈ నెల 11న మందకృష్ణ మాదిగ తలపెట్టిన విశ్వరూప మహాసభను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు మోర్తా రవి పిలుపునిచ్చారు. మండలంలోని కొండెవరంలో ఆదివారం మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంద కృష్ణ మాదిగ పిలుపు మేరకు ఈ సభకు ముఖ్య అతిథిగా ప్రధాని నరేంద్ర మోదీ హాజరవుతారని తెలిపారు. మాదిగలందరూ సభకు భారీగా తరలి వచ్చి జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వేమగిరి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

### శ్రమైక జీవనం చిత్రానికి అవార్డు



చక్రపాణిని సన్మానిస్తున్న నిర్వాహకులు

**ఏలేశ్వరం:** చిత్ర కళా నిలయం ఆధ్వర్యంలో చోడవరంలో ఆదివారం నిర్వహించిన 6వ ఆర్ట్ కాంపిటేషన్‌లో పట్టణానికి చెందిన తూము రౌతు చక్రపాణి గీసిన చిత్రానికి అవార్డు వచ్చింది. చక్రపాణి గీసిన శ్రమైక జీవనం చిత్రం టాప్ టెన్‌లో నిలిచి అవార్డు పొందింది. చిత్ర కళానిలయం వ్యవస్థాపకుడు బొడ్డేటి సూర్యనారాయణ ఆధ్వర్యంలో చక్రపాణిని సన్మానించి అవార్డు, నగదు పురస్కారం అందజేశారు. అవార్డు పొందిన చక్రపాణికి పలువురు అభినందనలు తెలిపారు.

### నేడు సీపీఎం బస్సు యాత్ర

**పెద్దాపురం:** శ్రీకాకుళంలో ప్రారంభమైన సీపీఎం ప్రజా రక్షణ భేరీ బస్సు యాత్ర సోమవారం పెద్దాపురం చేరుకోనున్నట్టు సీపీఎం మండల కార్యదర్శి నీలపాల సూరిబాబు తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లా మందసలో ప్రారంభమైన బస్సు యాత్ర కాకినాడ మీదుగా పెద్దాపురం చేరుకుంటుందన్నారు. ఈ సందర్భంగా స్థానిక మెయిన్‌రోడ్డులో బహిరంగ సభ నిర్వహిస్తారని తెలిపారు.

# పుణ్యం.. పవిత్రం...

- 14 నుంచి కార్తిక మాసం ప్రారంభం
- పంచారామ క్షేత్రంలో ఏర్పాట్లు
- నిత్యం ఆలయంలో లక్ష పత్రి పూజలు, జ్యోతిర్లింగార్చనలు



సామర్లకోటలోని పంచారామ క్షేత్ర ఆలయం



అమ్మవారు బాలాత్రిపుర సుందరీదేవి



పంచారామ క్షేత్రంలోని స్వామి వారు



పంచారామ క్షేత్రంలో క్యూలైన్ల ఏర్పాటు

**సామర్లకోట:** పంచారామ క్షేత్రమైన బాలత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయంలో కార్తిక మాసాన్ని పురస్కరించుకుని ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 14 నుంచి డిసెంబరు 13 వరకూ భక్తులకు మెరుగైన సేవల కోసం ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి. స్వామి వారి, అమ్మవారి ఉచిత దర్శనంతో పాటు, రూ.20, రూ.50, ప్రత్యేక దర్శనం రూ.100గా నిర్ణయించారు. ఈ మేరకు క్యూలైన్లు ఏర్పాటు చేశారు. వీఐపీ, రూ.100 దర్శనం కోసం ఆలయానికి ఇరువైపులా నిచ్చెనలు ఏర్పాటు చేశారు. నిత్యం తెల్లవారు గోపూజతో పూజలు ప్రారంభమవుతాయి. తెల్లవారు జామున పాలతో ఒకసారి మాత్రమే అభిషేకం చేస్తారు. కార్తిక మాసంలోని సోమవారాలు, కార్తిక పౌర్ణమి రోజున మాత్రమే పంచామృతాలతో అభిషేకాలు చేయడానికి అనుమతులున్నాయి. ప్రతిరోజూ భక్తుల ఆధ్వర్యంలో లక్ష పత్రి పూజలు నిర్వహిస్తారు. పంచారామాలు దర్శించుకునే భక్తుల దర్శనం అయ్యే వరకూ ఆలయం తెరచి ఉంచుతారు. నెల రోజుల పాటు ఉదయం గోపూజ, లక్ష పత్రి పూజలు, సాయంత్రం విష్ణేశ్వరుని పూజలు చేస్తారు. లక్ష పత్రి పూజలు చేసుకునే వారి కోసం ఆలయ దీపారాధన సంఘం ఆధ్వర్యంలో జ్యోతిర్లింగార్చన ఏర్పాటు చేస్తారు.

**కార్తిక మాస పూజలు**

కార్తిక మాసం ఉత్సవాలు ఈ నెల 14 సాయంత్రం ఆకాశ దీపంతో ప్రారంభిస్తారు. నవంబరు 26న కార్తిక పౌర్ణమిని పురస్కరించుకుని స్వామి వారి గ్రామోత్సవం, సాయంత్రం గోదావరి హారతి, రాత్రి జ్వాలాతోరణం ఉంటుంది. నవంబరు 29న స్వామి వారి ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయ కోనేరులో తెప్పోత్సవం నిర్వహిస్తారు. డిసెంబరు 11న మాసశివరాత్రి పూజలు, 12న అమావాస్యకు కోటి దీపాలంకరణ, 13న పోలి పాడ్యమికి స్వామివారి జటాజూటం అలంకరణతో ఉత్సవాలు ముగుస్తాయి. కార్తిక మాసంలో ఈ నెల 20, 27, డిసెంబరు 4, 11 తేదీల్లోని సోమవారాల్లో ప్రత్యేక పూజలు ఉంటాయి. పంచారామాల దర్శనం కోసం భక్తుల బస్సులు వచ్చేవరకూ ఆలయం తెరచి ఉంచుతారు.

**స్నానాల రేవులో గుర్రపు డెక్క**

మాండవ్య నారాయణస్వామి ఆలయం వద్ద గోదావరి కాలువ స్నానాల రేవు గుర్రపు డెక్కతో నిండిపోయింది. కార్తిక మాసంలో భక్తులు గోదావరి కాలువలో స్నానాలు చేస్తారు. గుర్రపు డెక్క కారణంగా భక్తులకు ఇబ్బంది కలిగే అవకాశం ఉంది. దీనిని దృష్టిలో ఉంచుకుని గుర్రపు డెక్కను తొలగించాలని భక్తులు కోరుతున్నారు.

**పవిత్ర మాసం కార్తికం**



కార్తిక మాసం ఎంతో పవిత్రమైంది. పంచారామ క్షేత్రంలో కార్తిక మాసం తెల్లవారుజామున గోపూజతో పూజలు ప్రారంభం అవుతాయి. ఈ మాసంలో శివుని పూజించడం వల్ల మంచి జరుగుతుంది. ఆవునెయ్యితో దీపాలు పెడితే మోక్షం, నూనెతో దీపాలు పెడితే ఐశర్యం లభిస్తుందని కార్తిక పురాణంలో ఉంది, కార్తిక మాసంలో ఉపవాస దీక్ష చేసి, ప్రతిరోజూ శివుడిని దర్శించుకుంటే పుణ్యఫలం లభిస్తుంది. కార్తిక మాసంలో ఆవు నెయ్యి, నూనెతో ఏర్పాటు చేసిన దీపాలను వెలిగించాల్సి ఉంటుంది.

– వేమూరి సోమేశ్వరశర్మ, పంచారామ క్షేత్ర పండితులు, సామర్లకోట

**ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు**



పంచారామ క్షేత్రానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేస్తున్నాం. పంచారామ క్షేత్రాల దర్శనం కోసం బస్సుల్లో వచ్చేవారి కోసం అర్ధరాత్రి 12 వరకూ ఆలయం తెరచి ఉంటుంది. కోనేరులో భక్తులు స్నానాలు చేసే అవకాశం ఉన్న కారణంగా కొత్త నీటితో కోనేరును నింపాం. క్యూలైన్లు, విద్యుద్దీపాలంకరణ ఏర్పాటు చేస్తున్నాం.

– డి.నాగమల్లేశ్వరరావు, ఈఓ, పంచారామ క్షేత్రం, సామర్లకోట

### ఘనంగా పేరంటాలమ్మ తల్లి జాతర



పేరంటాలమ్మ వారికి పూజలు చేస్తున్న కమిటీ నాయకులు

**సామర్లకోట:** పేరంటాలమ్మ జాతర ఆదివారం సాయంత్రం స్థానిక ఇస్మాయిల్ నగర్‌లో భక్తిశ్రద్ధలతో జరిగింది. శరన్నవరాత్రి ఉత్సవాలు ముగిసిన సందర్భంగా జాతర ఏర్పాటు చేశారు. గరగల నృత్యం, మ్యూజికల్ బ్యాండ్‌తో బాణసంచా కాల్పుల మధ్య పట్టణంలో ఊరేగింపు కొనసాగింది. ఆలయ కమిటీ నాయకులు నమ్మి శ్రీనివాసు, కొత్త గోవిందు, రాజన్, తాతారావు, ఈశ్వరరావు, నమ్మి సత్యనారాయణ, కంచర్ల భాగ్యరాజ్, శివ, బర్ల వెంకటరమణ భక్తులకు సేవలందించారు.

### నేడు ప్రజా సంకల్ప యాత్ర సంబరాలు

**సామర్లకోట:** వైఎస్సార్ సీపీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్పయాత్ర ప్రారంభించి ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా నియోజకవర్గ పరిధిలో సంబరాలు నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, పార్టీ నియోజకవర్గ కన్వీనర్ దవులూరి దొరబాబు తెలిపారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ స్థానిక ప్రసన్నాంజనేయనగర్‌లో ఉన్న వైఎస్సార్ విగ్రహం వద్ద కేక్ కటింగ్ కార్యక్రమం ఉందన్నారు. నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

# రాష్ట్రాభివృద్ధే సీఎం జగన్ లక్ష్యం

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- గొల్లప్రోలు మండలంలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం



కొత్త వజ్రకూటంలో వాటర్ ట్యాంక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

**పిఠాపురం:** రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. గొల్లప్రోలు మండలంలో ఆదివారం ఆయన సుడిగాలి పర్యటన చేశారు. గ్రామాల్లో రూ.కోటికి పైగా నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. గొల్లప్రోలు మండలం ఏకే మల్లవరంలో రూ.27.50 లక్షలతో చేపట్టిన జల్ జీవన్ మిషన్ పనులకు, జగనన్న కాలనీలో రూ.39.80 లక్షలతో చేపట్టిన ఇంటింటికీ కుళాయి కనెక్షన్ పనులకు శంకుస్థాపన చేశారు. ఏపీ మల్లవరంలో రూ.28.60 లక్షలతో నిర్మించే బోర్ వెల్ పనులకు ఆయన శంకుస్థాపన చేసారు. కొత్త వజ్రకూటంలో జల జీవన్ మిషన్ నిధులు రూ.22.70 లక్షలతో నిర్మించిన వాటర్ ట్యాంక్‌ను ఆయన ప్రారంభించారు. చెందుర్తిలో రూ.32.30 లక్షలతో నిర్మించే వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులకు ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ప్రజలు ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వులవకాయల నాగ లోవరాజు, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు అరిగెల రామయ్యదొర, అన్నవరం దేవస్థానం ప్రత్యేక ఆహ్వానితుడు మొగలి అయ్యారావు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో ప్రత్యేక ఓటు నమోదు శిబిరాలు



కొండెవరంలో ప్రతేక ఓటు నమోదు శిబిరాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ ప్రసాద్

**కొత్తపల్లి:** ఓటర్ల ముసాయిదా జాబితాపై అశ్రద్ధ వద్దని, ప్రత్యేక శిబిరాల్లో అందే దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ప్రసాద్ అన్నారు. మండల పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో రెండో రోజు ఆదివారం ప్రత్యేక ఓటు నమోదు శిబిరాలు నిర్వహించారు. కొండెవరం, ఉప్పాడ, కొత్తపల్లి గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా మండలంలోని 70 పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఓటు నమోదు శిబిరాలు నిర్వహించామన్నారు. ప్రజల నుంచి నూతన ఓట్లు కోసం అందే దరఖాస్తులు, ఓటరు కార్డులో చిరునామా, పేరు, పుట్టిన తేదీ తదితర మార్పులపై అందిన దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. సిబ్బంది ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలని, నిర్లక్ష్యంగా ఉండే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు తమ ఓటు హక్కుపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే శిబిరాల్లో బీఎల్ఓల వద్ద ఉన్న ఓటర్ల జాబితాను పరిశీలించుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# వాస్తవాలను ప్రజలకు వివరించండి

- ఎల్లో మీడియాకు ఎమ్మెల్యే పెండెం దొరబాబు సూచన
- గొల్లప్రోలులో రైతులకు మోటార్ల పంపిణీ



రైతులకు మోటార్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

**పిఠాపురం:** ఎల్లప్పుడూ పైనుంచి చెప్పింది వినడం, లేనిది ఉన్నట్టు ఉన్నది లేనట్టుగా రాయడం కాదు ఇక్కడ చేసిన అభివృద్ధి పనులను చూసి వాస్తవాలను ప్రజలకు తెలియజేయండి అంటూ ఎల్లో మీడాయాకు ఎమ్మెల్యే పెండెం దొరబాబు సూచించారు. గొల్లప్రోలులో రైతులకు వైఎస్సార్ జల కళ పథకంలో మంజూరైన మోటార్లను ఆదివారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి, చంద్రబాబుకు భజన చేయడం తప్ప ఇక్కడ జరిగిన అభివృద్ధి పట్టించుకునే ధోరణి ఎల్లో మీడియాకు లేదన్నారు. స్థానిక పాత్రికేయులుగా మీ కళ్ల ముందు జరిగిన అభివృద్ధిని చూడాలన్నారు. నిజంగా ఏమీ జరగకపోతే రాసినా తప్పు లేదని, ఉన్న దానిని లేనట్టుగా రాయడం జర్నలిజం విలువలను తుంగలోకి తొక్కడమే అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు పక్ష పాతిగా రైతులకు ఎన్నడూ లేని విధంగా అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. రైతు భరోసా కేంద్రాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. రైతుల ముంగిటకే పథకాలు వచ్చే విధంగా చేశారన్నారు. అనంతరం 12 మంది రైతులకు రూ.25 లక్షల విలువైన బోర్ వెల్‌లు, రూ.12.35 లక్షల విలువైన మోటార్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వులవకాయల నాగ లోవరాజు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అరిగెల రామయ్యదొర, కడింశెట్టి భాస్కరరెడ్డి, ఏపీడీ వసంత మాధవి పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



తాటిపర్తిలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

**పిఠాపురం:** చిన్నతనంలో వారంతా కలిసి చదువుకున్నారు. పూర్తిగా ఊహ తెలిశాక వారంతా ఒకే బడిలో స్నేహితులుగా మారారు. అనంతరం విడిపోయిన వారంతా సుమారు 40 ఏళ్ల తరువాత ఒక్కచోట కలిశారు. గొల్లప్రోలు మండలం తాటిపర్తి స్పెషల్ ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన 1981–82 బ్యాచ్ ఏడో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తాటిపర్తిలో కలిసి తమ చిన్న నాటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులను సత్కరించి తమ గురుభక్తిని చాటుకున్నారు. పలువురు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

# పట్టణంలో జోరుగా అన్నదానాలు



సామర్లకోట అన్నదానంలో పాల్గొన్న దవులూరి సుబ్బారావు, కౌన్సిలర్ తదితరులు

**సామర్లకోట:** శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం అనేక చోట్ల అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. స్థానిక భాస్కర్‌నగర్ కాలనీలో కనకదుర్గ ఆలయం వద్ద వార్డు కౌన్సిలర్ పాగా సురేష్ కుమార్ ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది. దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత దవులూరి సుబ్బారావు ముఖ్య అతిథిగా హాజరై, కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కనకదుర్గ ఆలయంలో పూజలు చేశారు. సుమారు ఆరు వేల మందికి అన్నదానం చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు వేగి సత్యనారాయణ, కటారి వెంకట్రావు, ఆలయ కమిటీ నాయకులు భక్తులకు సేవలందించారు. అలాగే స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలోని రైల్వే క్వార్టర్సులో శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. బలుసులపేటలో నేతల హరిబాబు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం జరిగింది.

# చీరాల వెళ్లి పింఛను అందజేత



శ్రీదేవికి పింఛను అందజేస్తున్న జోగారావు

**సామర్లకోట:** రెండు నెలలుగా పింఛను అందుబాటులో లేని లబ్ధిదారు దంతినాడ శ్రీదేవి చీరాలలో ఉన్నట్టు తెలిసి.. 8వ సచివాలయం వెల్ఫేర్ సెక్రటరీ జోగారావు ఆదివారం చీరాలకు వెళ్లి పింఛను అందజేశారు. ఈ సందర్భంగా ఆదివారం రాత్రి చీరాల నుంచి ఆయన ఫోన్‌లో మాట్లాడుతూ, మూడో నెల కూడా తీసుకోకపోతే శ్రీదేవి పింఛను రద్దవుతుందన్నారు. దీంతో తిరిగి పింఛను దరఖాస్తు చేసుకుని, ఆరు నెలల పాటు వేచిఉండాల్సి వస్తుందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ఆమె చిరునామా సేకరించి పింఛను అందజేశారు. అనారోగ్యంతో ఉండటంతో శ్రీదేవి ఆపరేషన్ చేయించుకోవడానికి తన కుమార్తె ఇంటికి వెళ్లింది.

### వైద్య శిబిరం

**సామర్లకోట:** పట్టణంలోని సత్యనారాయణపురంలో వినకోట సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు ఆయన ఉచిత పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. మొత్తం 82 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నట్టు సురేష్ తెలిపారు.

### ఏలేరులో 78.03 మీటర్ల నీటి నిల్వలు

**ఏలేశ్వరం:** ఏలేరు జలాశయంలో ఆదివారం నాటికి 78.03 మీటర్ల నీటి నిల్వలు ఉన్నాయి. ఎగువ ప్రాంతం నుంచి 321 క్యూసెక్కుల నీరు జలాశయంలో చేరింది. ప్రస్తుతం ప్రాజెక్టులో 86.56 మీటర్లకు గాను 78.03 మీటర్లు, 24.11 టీఎంసీలకు గాను 11.26 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయి. దిగువ ఆయకట్టుకు 200, విశాఖకు 100, తిమ్మరాజు చెరువుకు 50, పంపాకు 50 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**శంఖవరం:** జాతీయ రహదారిపై మండలంలోని కత్తిపూడి వద్ద ఆదివారం జరిగిన ప్రమాదంలో వ్యక్తి మృతి చెందినట్టు అన్నవరం పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. తొండంగి మండలం ఏవీ నగరం గ్రామానికి చెందిన దామోజు లోవకుమార్ (38) ద్విచక్ర వాహనంపై అన్నవరం నుంచి కత్తిపూడి వస్తుండగా సీతంపేట రిఫరల్ ఆసుపత్రి సమీపంలో అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో లోవకుమార్ అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృత దేహాన్ని తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

# ఘనంగా సామూహిక కుంకుమ పూజలు



వేట్లపాలెంలో నిర్వహిస్తున్న సామూహిక కుంకుమ పూజలు

**సామర్లకోట:** పంచారామ క్షేత్రం ఆధ్వర్యంలో వేట్లపాలెం గ్రామంలోని కనకదుర్గ ఆలయంలో ఆదివారం రాత్రి సామూహిక కుంకుమ పూజలు ఘనంగా నిర్వహించారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆదేశాల మేరకు ధర్మప్రచార వారోత్సవాల్లో భాగంగా ఈఓ డి.నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో వేద పారాయణ, కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, సన్నిధిరాజు వెంకన్న, వేమూరి చంటి, సత్యనారాయణమూర్తి, అళ్లకి రాజాల ఆధ్వర్యంలో పూజ కార్యక్రమాలు, కుంకుమ పూజలు జరిగాయి. సోమవారం హుస్సేన్‌పురంలో, 7న వీకే రాయపురంలో, 8న నవరలో కార్యక్రమాలు జరుగుతాయని ఈఓ తెలిపారు.

# సామాజిక సాధికార యాత్రపై ప్రచారం



సామాజిక సాధికార యాత్ర ప్రచారం కోసం కరప నుంచి బయలుదేరిన వైఎస్సార్ సీపీ శ్రేణులు

**కరప:** కాకినాడలోని సర్పవరం జంక్షన్ వద్ద సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ఆధ్వర్యంలో జరిగే సామాజిక సాధికార యాత్ర బహిరంగ సమావేశం విజయవంతానికి వైఎస్సార్ సీపీ మండల నాయకులు గ్రామాల్లో విస్తృత ప్రచారం చేసి, అవగాహన కల్పించారు. వైఎస్సార్ సీపీ మండల యూత్ అధ్యక్షుడు పెంకే సత్తిబాబు, పార్టీ మండల అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, పార్టీ శ్రేణులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి ఆదివారం గ్రామాల్లో పర్యటించారు. సామాజిక సాధికార యాత్ర వాల్‌పోస్టర్లు అతికిస్తూ, స్టిక్కర్లు పంచారు. సర్పవరం జంక్షన్ సభకు అధికసంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ సందర్భంగా పెంకే సత్తిబాబు మాట్లాడుతూ మంత్రులు, ఎమ్మెల్యేలు సభకు హాజరై, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు చేస్తున్న సంక్షేమ పాలన, రాష్ట్రాభివృద్ధిని వివరిస్తారన్నారు. మండలంలోని 23 గ్రామాల నుంచి మోటార్‌సైకిళ్లు, ఆటోలలో ర్యాలీగా పెనుగుదురు నుంచి కాకినాడకు వెళ్లి.. ఎమ్మెల్యే కన్నబాబును కలిసి అక్కడి నుంచి సర్పవరం జంక్షన్‌కు తరలివెళతారని ఈశ్వరరావు తెలిపారు. సాధికార యాత్రలో పాల్గొనేందుకు మండలం నుంచి సుమారు 10 వేల మంది స్వచ్ఛందంగా రానున్నారని, ఇందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు జెడ్పీటీసీ సుబ్బారావు తెలిపారు. పార్టీ నాయకులు సాదే లోహిదాస్, నక్కా సత్తిబాబు, మద్దూరి భాస్కర్, కొత్త రవి, సింగినేని నాని, అప్పనపల్లి పెద్ద, అడబాల ప్రసాద్, వనుం భాస్కర్, ముద్రగడ వీరబాబు తదితరులు పాల్గొన్నారు.